పేదలకు వైద్య విద్యను దూరం చేసే కుట్ర



పేద విద్యార్థులకు ఉన్నత విద్యను దూరం చేసేలా ప్రభుత్వం కుట్ర పన్నుతోంది. పేద, మధ్య తరగతి విద్యార్థులు వైద్య విద్య చదవాలంటే ప్రభుత్వ కళాశాలలు చాలా అవసరం. ప్రభుత్వ కళాశాలలను ప్రైవేటు పరం చేసేందుకు ప్రభుత్వం యత్నిస్తోంది. ప్రైవేటు కళాశాలల్లో లక్షలాది రూపాయలు చెల్లించి చదివే స్తోమత లేక చాలా మంది విద్యార్థులు వైద్య విద్యకు దూరం అవుతారు. ప్రభుత్వ ఆధ్వర్యంలోనే కొత్త కళాశాలలను ప్రారంభించి పేద విద్యార్థులకు వైద్య విద్యను అందేలా చూడాలి.

- జగదీష్, ఆల్ ఇండియా స్టూడెంట్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు, ప్రొద్దుటూరు



కూటమి ప్రభుత్వ తీరు సరికాదు



మెడికల్ కళాశాలల విషయంలో కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న తీరుతో పేద విద్యార్థులకు వైద్య విద్య దూరమవుతుంది. మెడికల్ సీట్లు కేటాయిస్తే... తమకు వద్దంటూ లేఖ ఇవ్వడం దారుణం. అలాగే కొత్త వైద్య కళాశాలలను ప్రైవేట్ యాజమాన్యానికి అప్పగిస్తామని అంటున్నారు.. ఇదే జరిగితే సామాన్య, మధ్యతరగతి విద్యార్థులు వైద్య విద్యను చదవలేని పరిస్థితి ఏర్పడుతుంది. అలాగే పేదలకు ఉచిత వైద్యం దూరం కావడం ఖాయం. ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి.

- ముడియంచిన్ని, జిల్లా అధ్యక్షుడు, డీవైఎఫ్ఐ, బద్వేలు

ఘనంగా గణనాథుని గ్రామోత్సవం



నిమజ్జనానికి తరలుతున్న ఏకదంతుడు



వినాయక విగ్రహం వద్ద మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు కల్చరల్ : పట్టణంలోని పలు ప్రాంతాలలో కొలువుదీరిన బొజ్జగణపయ్యలను శనివారం కొందరు గణపతి ఉత్సవ కమిటీ వారు నిమజ్జనానికి తరలించారు. ఉదయం గణనాథునికి విశేష పూజాకార్యక్రమాలను నిర్వహించి భక్తిశ్రద్ధలతో పూజించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం చేశారు. అనంతరం బొజ్జగణపయ్య విగ్రహాలను ట్రాక్టర్లు, ఇతర వాహనాల్లోకి ఎక్కించి పురవీధుల్లో చెక్కభజనలు, డప్పువాయిద్యాలు, బాణసంచా పేలుళ్ల మధ్య రంగులు చల్లుకుంటూ గ్రామోత్సవం నిర్వహించారు. విగ్రహాలను పెన్నానది, చాపాడు, కామనూరు వద్ద ఉన్న కుందూనదిలో నిమజ్జనం చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. దాదాపు పట్టణంలోని చాలా విగ్రహాలను గణపతి ఉత్సవ కమిటీల వారు నిమజ్జనం చేశారు.

వినాయకునికి రాచమల్లు పూజలు

ప్రొద్దుటూరు : స్థానిక విజయనగరం వీధిలో వరసిద్ధి వినాయక అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకునికి మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి శనివారం సాయంత్రం ప్రత్యేక పూజలు చేశారు. వార్డు కౌన్సిలర్ పిట్టా బాలాజీ, మాజీ కౌన్సిలర్ పిట్టా భద్రమ్మ ఆయనకు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో తొగటవీర క్షత్రియ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ చౌడం రవి, వైఎస్సార్‌సీపీ రాజుపాళెం మండల కన్వీనర్ రాజశేఖరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మోక్షగుండం విశ్వేశ్వరయ్య జీవితం.. స్ఫూర్తిదాయకం



చాపాడు : మాట్లాడుతున్న ఆర్‌అండ్‌బీ డీఈ వై.విజయచంద్రారెడ్డి



ప్రొద్దుటూరు కల్చరల్ : నమూనాలను పరిశీలిస్తున్న అధ్యాపకులు

చాపాడు : మోక్షగుండం విశ్వేశ్వరయ్య దేశంలోనే గొప్ప సివిల్ ఇంజినీర్‌గా పేరు తెచ్చుకున్నారని.. ఆయన జీవితాన్ని విద్యార్థులు స్ఫూర్తిదాయకంగా తీసుకోవాలని ఆర్ అండ్‌బీ డిప్యూటీ ఇంజినీర్ వై.విజయచంద్రారెడ్డి అన్నారు. స్థానిక చైతన్య భారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(సీబీఐటీ)కాలేజీలో శనివారం ముందస్తుగా మోక్షగుండం విశ్వేశ్వరయ్య 164వ జయంతిని పురస్కరించుకుని 57వ ఇంజినీర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోక్షగుండం ఎన్నో అద్భుత కట్టడాలు నిర్మించారన్నారు. అనంతరం విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులను పరిశీలించి ఉత్తమ ప్రతిభ చాటిన ముగ్గురికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీబీఐటీ డైరెక్టర్ అడ్మిన్ జి.శ్రీనివాసులరెడ్డి, ప్రిన్సిపాల్ ఎస్.శృతి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఘనంగా ఇంజినీర్స్‌డే వేడుకలు

ప్రొద్దుటూరు కల్చరల్ : మండల పరిధిలోని గౌతమి మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో ఇంజినీరింగ్ డే వేడుకలను నిర్వహించారు. విద్యార్థినులు రూపొందించిన నమూనాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రామసుబ్బమ్మ, కరస్పాండెంట్ బాబమ్మ, డైరెక్టర్‌లు నాగూర్, రవీంద్రారెడ్డి, కో డైరెక్టర్ శైలూష, డిప్లమో ప్రిన్సిపాల్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ షాపు వద్ద మహిళల ఆందోళన

ప్రొద్దుటూరు : స్థానిక 13వ వార్డు పరిధిలోని రేషన్ షాపు వద్ద శనివారం మహిళలు ఆందోళనకు దిగారు. డీలర్ వెంకటస్వామి బియ్యం పంపిణీలో జాప్యం చేయడంతో నిరసన వ్యక్తం చేశారు. డీలర్ సంఘటన స్థలానికి వచ్చి బియ్యం పంపిణీ చేస్తామని తెలపడంతో పరిస్థితి సర్దుమణిగింది.

వైభవంగా సీతారాముల కల్యాణం



సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

అట్లూరు : మండల పరిధిలోని కుంభగిరి బీసీ కాలనీలో శనివారం సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. రెండేళ్ల క్రితం కాలనీ వాసులు ఐకమత్యంతో నూతనంగా శ్రీ రామాలయం నిర్మించి సీతారామ లక్ష్మణ విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఏటా వార్షికోత్సవం సందర్భంగా సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా రెండో వార్షికోత్సవం సందర్భంగా వేద పండితులచే భక్తిశ్రద్ధలతో కల్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కాలనీ వాసులతోపాటు చుట్టు పక్కల ప్రాంతాల వారు పాల్గొన్నారు.

పెద్దమ్మ ఆలయ గదులను తొలగించొద్దు



పెద్దమ్మ తల్లి ఆలయం వద్ద దీక్ష చేస్తున్న సుధాకర్ మాదిగ

ప్రొద్దుటూరు : స్థానిక కూరగాయల మార్కెట్ ఆవరణలోని పెద్దమ్మతల్లి ఆలయ గదులను తొలగించొద్దని కోరుతూ ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి సుధాకర్ మాదిగ శనివారం దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ గదుల కూల్చివేతకు సంబంధించి గతంలో మున్సిపల్ కమిషనర్ తనకు నోటీసులు ఇవ్వడంతో హైకోర్టులో పిటీషన్ వేశానన్నారు. కోర్టులో ఈనెల 17న విచారణ జరగాల్సి ఉండగా.. వెంటనే గదులను తొలగించాలని తాజాగా మున్సిపల్ కమిషనర్ అధికారులను ఆదేశించారన్నారు. కోర్టులో విచారణ జరుగుతుండగానే గదులను కూల్చడం భావ్యం కాదన్నారు. దీక్షలో రాజేశ్వరి, మద్దిలేటమ్మ, ప్రసాద్, సుబ్బరాయుడు, శివకృష్ణ, కొండయ్య, రాజేష్, దాసు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక

అట్లూరు : అట్లూరు కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల నుంచి ఎనిమిది మంది విద్యార్థినులు రాష్ట్ర స్థాయి ఆటల పోటీలకు ఎంపికయ్యారు. వారిని శనివారం పాఠశాల స్పెషలాఫీసర్ ఫణిశ్రీ, పీఈటీ ప్రమీళ అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 13వ తేదీన అండర్-19 ఆటల పోటీలలో భాగంగా గండిక్షేత్రంలోని ఏపీఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్ పాఠశాలలో జరిగిన జిల్లా స్థాయి ఆటల పోటీల్లో ప్రతిభ కనబరిచారని పేర్కొన్నారు. రబ్బీలో జయని, హ్యాండ్‌బాల్‌లో రెడ్డెమ్మ, బాస్కెట్‌బాల్‌లో సుహాషిణి, నెట్‌బాల్‌లో మస్తాన్‌బీ, జగదీశ్వరి, సెపక్‌తక్రాలో ప్రసన్న, సుప్రియ, స్పందన ఎంపికయ్యారని వివరించారు.

యూటీఎఫ్ నూతన కార్యవర్గం

పోరుమామిళ్ల : ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) మండల నూతన కమిటీని జిల్లా కార్యదర్శి కె.చెన్నయ్య ఆధ్వర్యంలో శనివారం ఎన్నుకున్నారు. మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా శ్రీనివాసులు, ఈశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా ప్రవీణ్‌కుమార్, ఆదిత్య లక్ష్మి, కోశాధికారిగా సత్యనారాయణ, కార్యవర్గ సభ్యులుగా గంగయ్య, విజయరావు, గౌస్, సంజీవ్‌కుమార్, వెంకటరెడ్డి, ఆనందరావు ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షులుగా సుధీర్‌కుమార్‌ను ఎన్నుకున్నారు. సీపీఎస్ అధ్యక్షులుగా గురయ్య, జిల్లా కౌన్సిలర్లుగా చంద్రశేఖర్, చెన్నయ్య, రాఘవేంద్ర, క్రిష్ణయ్య, ఖాజానాయబ్ రసూల్, శ్రీనివాసులు, ఈశ్వరరావు ఎన్నికయ్యారు.

బద్వేలు వాసులకు సేవారత్న అవార్డులు

బద్వేలు అర్బన్ : సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా విశేష సేవలందిస్తున్న బద్వేలు పట్టణానికి చెందిన పలువురికి జాతీయ సేవారత్న అవార్డులు లభించాయి. శనివారం బెంగళూరులోని అంబేడ్కర్ భవన్‌లో సోమలరాజు ఫౌండేషన్ 12వ వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షులు శివకుమార్‌రాజు చేతుల మీదుగా బి.గురుమూర్తి, సి.వెంకట సుబ్బయ్యలకు జాతీయ సేవారత్న అవార్డు, కొండపల్లి చిన్నసుబ్బారావు, ఎస్.ఎ.సత్తార్‌లకు ఏపీజే అబ్దుల్‌కలాం అవార్డు అందించి వారిని సన్మానించారు.

అవార్డు ప్రదానం

కాశినాయన : మండలంలోని మిద్దెల గ్రామానికి చెందిన ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్, సంఘసేవకుడు బి.యస్.నారాయణరెడ్డికి అవార్డును అందజేశారు. బెంగళూరులోని సోములరాజు ఫౌండేషన్ 12వ వార్షికోత్సవం సందర్భంగా సంఘ సేవకులకు అవార్డులు ప్రదానం చేశారు. ఇందులో భాగంగా ఆయనకు అవార్డు అందజేసి, సత్కరించారు.

మురుగునీటి గుంతతో విద్యార్థులకు ఇక్కట్లు

పోరుమామిళ్ల : పట్టణంలోని వెంకటేశ్వర ఉన్నత పాఠశాల వెనుక వైపు ఏర్పడ్డ మురికినీటి గుంతతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరపోగు రవి ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన శనివారం విద్యార్థులతో కలసి మురికినీటి గుంతను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంట కాలువ పూడ్చి వేయడం వల్లే ఇలా తయారయిందని అన్నారు. పోరుమామిళ్ల చెరువు నుంచి రంగసముద్రం చెరువుకు వెళుతున్న పంట కాలువను రియల్ ఎస్టేట్ కోసం కొందరు కబ్జా చేయడం వల్లే సమస్య ఉత్పన్నమయిందన్నారు. 700 ఏళ్ల క్రితం పోరుమామిళ్ల చెరువు నుంచి రంగసముద్రం చెరువుకు దాదాపు 10 అడుగుల వెడల్పుతో అప్పటి పాలకులు విశాలంగా ఈ కాలువ ఏర్పాటు చేశారన్నారు. ఆర్టీసీ బస్టాండు నిర్మాణంతో ప్రధాన రహదారికి తూర్పు, పడమర ప్రాంతాల్లో భవనాల నిర్మాణం మొదలయిందని, మాగాణి భూములన్నీ రియల్‌ఎస్టేట్ కిందికి పోయాయన్నారు. మాగాణి భూముల్లో కాలేజీలు, కార్యాలయాలు, భారీ భవనాల నిర్మాణం జరిగిందని, పంట కాలువను కబ్జా చేసి రియల్ ఎస్టేట్‌కు అనుకూలంగా చేశారని ఆరోపించారు. దీంతో పంట కాలువలో వస్తున్న నీరు నిలిచిపోయిందన్నారు. 3 నెలలుగా ఈ సమస్యపై విద్యార్థులు అధికారులకు చెబుతున్నారని, అయినా పట్టించుకోవడం లేదన్నారు. కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకొని, పంట కాలువను యథాతథంగా తయారు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల నాయకులు కిశోర్, వంశీ, పండు, కృష్ణ, రాము పాల్గొన్నారు.

రాజీ మార్గమే ఉత్తమం



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి వై.జె.పద్మశ్రీ

బద్వేలు అర్బన్ : దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న కేసులలో కక్షిదారులు రాజీ మార్గంలో పరిష్కరించుకోవడం ఉత్తమమని, ఇందుకు లోక్ అదాలత్ సహకరిస్తుందని సీనియర్ సివిల్ జడ్జి వై.జె.పద్మశ్రీ, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి బి.గాయత్రి పేర్కొన్నారు. శనివారం స్థానిక కోర్టులో జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. అనంతరం రెండు బెంచీలు ఏర్పాటు చేసి 352 క్రిమినల్ కేసులు, 12 సివిల్ కేసులు పరిష్కరించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ నాయకులు, లోక్ అదాలత్ బెంచ్ మెంబర్‌లు, పోలీసులు పాల్గొన్నారు.

ఆంగ్లంలో ప్రావీణ్యంతో ఉన్నత ఉద్యోగాలు



ఇంగ్లిషు క్లబ్ లోగోను ఆవిష్కరిస్తున్న ఉప విద్యాశాఖాధికారి రాజగోపాల్‌రెడ్డి

ప్రొద్దుటూరు : ఆంగ్లంలో పట్టు సాధిస్తే ఉన్నత ఉద్యోగాలు సాధించవచ్చని ఉప విద్యాశాఖాధికారి రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఎన్జీఓ హోంలో ది ఇంగ్లిషు క్లబ్ ప్రొద్దుటూరు లోగోను శనివారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంగ్లిషు క్లబ్‌ల ఏర్పాటు ఉపాధ్యాయులను ప్రభావితం చేయడమేగాక విద్యార్థుల్లో ఇంగ్లిషు పట్ల ఆకర్షణ పెరిగి నేర్చుకునేందుకు ప్రయత్నిస్తారన్నారు. అనంతరం పదవి విరమణ పొందిన 15 మంది ఇంగ్లిషు ఉపాధ్యాయులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ది ఇంగ్లిషు క్లబ్ అధ్యక్షుడు రషీద్ ఖాన్, ప్రధాన కార్యదర్శి అఫ్సర్, కార్యదర్శి సునీల్, ఉపాధ్యక్షుడు ప్రభుకుమార్, కోశాధికారి శివప్రతాప్, ప్రసాద్, రామసుబ్బయ్య, ఇబ్రహీం, రమణారెడ్డి పాల్గొన్నారు.

మద్యం సీసాలు స్వాధీనం

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక కొత్తపల్లె క్రాస్ వద్ద ఖాజాపీర్ నుంచి 34 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. చాపాడు మండలంలోని ఖాదర్‌పల్లెకు చెందిన ఖాజాపీర్ మద్యం సీసాలు కలిగి ఉన్నాడని సమాచారం రావడంతో శనివారం రూరల్ ఎస్ఐ సురేష్ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. అతనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

జూదరుల అరెస్ట్

దువ్వూరు : గుడిపాడు గ్రామ సమీపంలో కంపచెట్లలో పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ వినోద్ కుమార్ శనివారం తెలిపారు. వారి వద్ద నుంచి రూ.7,800 స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

ఇరు వర్గాల మధ్య ఘర్షణ

చాపాడు : నరహరిపురంలో శనివారం ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. పాత కక్షల కారణంగా వారు ఘర్షణ పడ్డారు. ఇరు వర్గాల ఫిర్యాదు మేరకు ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చిన్న పెద్దయ్య తెలిపారు.